

2లో


## అరుణాచలం లో అన్నా రాంబాబు

– పుట్టినరోజు సందర్భంగా స్వామి వారి దర్శనం

RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
ఆగష్టు : 03 ఆదివారం సంపుటి : 29 సంచిక : 178

# ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ అమలు

– ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





అగ్ని న్యూస్,మార్కాపురం (ఆగస్ట్ 02): ఇచ్చిన మాటకు కట్టుబడి అన్నదాత సుఖీభవ ని అమలు చేస్తున్నామని శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి తెలిపారు. మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామం,భూపతి పల్లి గ్రామాలలో శనివారం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి పాలకులు ఎన్నికల ముందు 2000 పెన్షన్ ని 3000 పెన్షన్ చేస్తామనిచెప్పి ఎన్నికల అనంతరం మూడువేల రూపాయలు చేయడానికి నాలుగున్నర సంవత్సరాలు సమయం పట్టిందని కానీ ఇప్పటి మా ప్రభుత్వం ఇచ్చిన మాట కట్టుబడి ఎన్నికల అనంతరం తొలి నెలలోనే 4000 రూపాయల పెన్షన్ను పెంచామని అదేవిధంగా వికలాంగులకు 6000 రూపాయలు సంపూర్ణ వికలాంగులకు 15 వేల రూపాయలు తలసేమియా, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ను అమలు చేస్తున్నామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి విద్యార్థికి అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తామని చెప్పారని 2లో

## అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

– మండుటెండలో మంచం మీద కూర్చొని పీఎం కార్యక్రమం తిలకించిన సీఎం





అగ్ని న్యూస్, దర్శి (ఆగష్టు 02): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లాలోని దర్శి నియోజకవర్గం తూర్పు వీరాయపాలెంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వారణాసి నుంచి నిర్వహించిన కార్యక్రమాన్ని, సీఎం చంద్రబాబు నాయుడు మండుటెండలో మంచం మీదకూర్చొని కూర్చొని తిలకించారు. ఈయన వెంట జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు,ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి,20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్,జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ,జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, సాగర్ ,పలు శాఖల అధికారులు, నియోజకవర్గం లోని పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతన్నలకు వెన్నుదన్ను - అన్నదాత సుఖీభవ



– ఎమ్మెల్యే ముత్తుముల

అగ్ని న్యూస్, గిద్దలూరు (ఆగస్టు 02): ధరల స్థిరీకరణ కోసం 3 వేల కోట్లు కేటాయిస్తామని గత ప్రభుత్వం రైతులను మోసం చేస్తే.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గిద్దలూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సహకారం తో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడం జరుగుతుంది అని అన్నారు. కూటమి ప్రభుత్వం సంవత్సరానికి అన్నదాత సుఖీభవ పేరుతో 20 వేల రూపాయలు జమ చేస్తున్నదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దాదాపు తొమ్మిది లక్షల కోట్ల పెట్టుబడులతో 8 లక్షల 50 వేల ఉద్యోగాలు కల్పించబోతున్నామని డీఎస్సీ ద్వారా 16 వేల ఆరువందల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని అన్నారు. గత పాలకులు ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించే అన్న క్యాంటీన్ల ను 2లో

## అరుణాచలం లో అన్నా రాంబాబు

మొదటి పేజి తరువాయి ...

అగ్ని న్యూస్, మార్కాపురం ( ఆగష్టు 02): గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అన్నా రాంబాబు కుటుంబ సమేతంగా తమిళనాడు లోని ప్రముఖ శైవ క్షేత్రం అరుణాచలం లో స్వామివారిని దర్శించుకున్నారు. పుట్టిన రోజు సందర్భంగా ఆయన కుటుంబ సమేతంగా అరుణాచలం వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తిరుమల తిరుపతి దర్శనం చేసుకొని మార్కాపురం వస్తారని అన్నా కార్యాలయ వర్గాలు తెలిపాయి. అరుణాచలం లో అన్నా రాంబాబు దంపతులతో పాటు ఆయన కుమారుడు కృష్ణ చైతన్య దంపతులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

## ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ అమలు

మొదటి పేజి తరువాయి ...

ఎన్నికల అనంతరం మాట మార్చి కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి పథకం అమలు చేశారని కానీ ఇప్పటి మా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా వారందరికీ సంవత్సరానికి 13వేల రూపాయల చొప్పున ఇచ్చామని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతు భరోసా పేరుతో సంవత్సరానికి 13వేల రూపాయలు మాత్రమే చెల్లించారని కానీ ఇప్పటి మా ప్రభుత్వం సంవత్సరానికి అన్నదాత సుఖీభవ పేరుతో 20వేల రూపాయలు జమ చేస్తున్నామని అన్నారు.కూటమి ప్రభుత్వం దాదాపు తొమ్మిది లక్షల కోట్ల పెట్టుబడులతో 8 లక్షల 50 వేల ఉద్యోగాలు కల్పించబోతున్నామని డీఎస్సీ ద్వారా 16 వేల ఆరు వందల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని అన్నారు.గత పాలకులు ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించే అన్న క్యాంటీన్లను మూసి వేశారని కానీ ఇప్పటి మా ప్రభుత్వం ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనము అందించే అన్న క్యాంటీన్ పునః ప్రారంభించామని గుర్తు చేశారు.ఈనెల ఆగస్టు 15వ తారీకు నుండి ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని అన్నారు.ఇదే నికరంపల్లి గ్రామంలో అన్నదాత సుఖీభవ పేరుతో 370 మంది రైతులకు దాదాపు 72 లక్షల రూపాయలు అకౌంట్‌లో జమ చేయబోతున్నామని అన్నారు. భూపతి పల్లి గ్రామంలో 1142 మంది రైతులకు రెండు కోట్ల 32 లక్షల రూపాయలు జమ చేయబోతున్నామని అన్నారు.పై అంకెల ద్వారా ప్రజలను ఎవరూ మోసం చేశారు ఎవరు ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు ప్రజలు గ్రహించాలని అన్నారు.వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేశామని ప్రాజెక్టు ప్రారంభించి గత ముఖ్యమంత్రి వెళ్లిపోయారని ఇంకా నాలుగువేల కోట్ల రూపాయలు ప్రాజెక్టు పూర్తికి అవసరమని దీని ద్వారా వైసీపీ నాయకులు ఈ ప్రాంత ప్రజల చెవులలో పువ్వులు పెట్టి ఈ ప్రాంత ప్రజలను నిలువునా దగా చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు మార్కాపురం జిల్లా ఇవ్వకుండా ఈ ప్రాంత ప్రజలను వంచించారని తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధిని అడ్డుకున్నారని తెలియజేశారు.ఈ సందర్భంగా రైతులు శాసనసభ్యులు వారితో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్, తెలుగుదేశం నాయకులు రైతు సోదరులు మహిళలు పాల్గొన్నారు.

## రైతన్నలకు వెన్నుదన్ను - అన్నదాత సుఖీభవ

మొదటి పేజి తరువాయి ...

మూసి వేశారని కానీ ఇప్పటి మా ప్రభుత్వం ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనము అందించే అన్న క్యాంటీన్ పునఃప్రారంభం చేశాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ,జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :**

## తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా : సిడిపివో పద్మావతి





అగ్నిన్యూస్,మార్కాపురం(ఆగస్టు2):పుట్టిన బిడ్డకు తల్లి పాలు మొదటి టీకా అని సిడిపివో పద్మావతి తెలిపారు.స్థానిక ఇండో ఫ్యాక్టరీ, చిన్న బ్రిడ్జి ఏరియా, అంగన్వాడీ సెంటర్ల లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపివో పద్మావతి హాజరై మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుండి ఆగస్టు 7వరకు అన్ని అంగన్వాడి సెంటర్ల లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. బలహీన నవజాత శిశువుకు అందించవలసిన కంగారు మదర్ కేర్ పద్ధతులను గురించి తల్లులకు తెలియజేశారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని, రోగనిరోధక శక్తిని పెంపొందించి ఎలాంటి వ్యాధులు దరిచేరనీయకుండా చేస్తాయని సూచించారు. తల్లిపాలను ఆరు నెలలు వరకు ఇతర పదార్థాలు ఇవ్వకుండా పట్టించాలని, ఆరు నెలల తర్వాత ఏడో నెలలో తల్లిపాలతో పాటు అనుబంధ పౌష్టికాహారం అలవాటు చేయాలని బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లులకు కలిగే లాభాలు తల్లికి బిడ్డకు ఉండే మంచి సంబంధాలను గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రవి కుమారి, మహిళా పోలీసు షేక్ షిరిన్, అంగన్వాడి కార్యకర్తలు,ఆయాలు తల్లులు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహణ పై సమీక్ష




అగ్నిన్యూస్,యర్రగొండపాలెం(ఆగస్టు2): శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ గురించి పుల్లలచెరువులో రైస్ మిల్ లో వైసీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహిస్తున్న బాబు షూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టో రీకాలింగ్ కార్యక్రమాన్ని పుల్లలచెరువు మండల కేంద్రంలో త్వరలో నిర్వహించడం జరుగుతుందనీ తెలిపారు.ఈ సమావేశంలో పుల్లలచెరువు మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భారీగా వైసిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమం లో వైసీపీ నాయకులు, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## పొదిలిలో 8363 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్



అగ్నిన్యూస్,పొదిలి(ఆగస్ట్2): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కు సంబంధించిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి ద్వారా రైతుల కి అన్న దాత సుఖీభవ -పీఎం కిసాన్ నిధులు విడుదల చేయడం జరిగింది ఆ కార్యక్రమం సంబందించిన లైవ్ ప్రోగ్రాం ద్వారా రైతులు వీక్షించడం జరిగింది అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి సంబంధించి పొదిలి మండలం లో 8 363 మంది రైతులకు గాను మొదటి విడత కింద 5,85,41000 (ఐదుకోట్ల ఎనబై ఐదు లక్షల నలబై ఒక వేల రూపాయలు శనివారం రోజున రైతుల ఖాతా నందు జమ చేయడం జరిగినది.ఇందులో భాగంగా కుంచేపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పొదిలి షేక్ ఇమాంసా,టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరిపూటి అనిల్ కుమార్, వై.వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, గ్రామ రైతు సోదరులు,మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రం ల పరిధిలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ఆ గ్రామంలోని రైతులు పాల్గొని విజయవంతం చేసారు.

## నేడు అగ్రిగోల్డ్ బాధితులకు సమావేశం



అగ్నిన్యూస్,యర్రగొండపాలెం(ఆగస్టు2):అగ్రిగోల్డ్ బాధితుల కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితులతో నేడు సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు సుబ్బారావు తెలిపారు.శనివారం స్థానిక యర్రగొండపాలెం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ నేడు ఉదయం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం 10 గంటలకు స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశానికి ఈ ప్రాంతంలో ఉన్న అగ్రిగోల్డ్ బాధితులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.ఈ సమావేశానికి అగ్రిగోల్డ్ బాధితుల అండ్ ఏజెంట్ సెల్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పల నాగేశ్వరావు,అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర కార్యదర్శి వి తిరుపతిరావు,అగ్రిగోల్డ్ బాధితుల ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్,అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర నాయకులు ప్రకాశం జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా గౌరవ అధ్యక్షులు పి హనుమారెడ్డి,సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవండ్ల శ్రీనివాస్,సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్,నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య పాల్గొంటారని తెలిపారు.అత్యంత ప్రాధాన్యతతో కూడిన ఈ సమావేశనికి అగ్రిగోల్డ్ బాధితుల కస్టమర్స్ అసోసియేషన్ నాయకులు కస్టమర్స్ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ సమావేశంలో యర్రగొండపాలెం మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛమైన ఆక్సిజన్ కై ప్రతి పాఠశాలలో విరివిగా మొక్కలు నాటాలి

### - ఫారెస్ట్ ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్ ఆనందరావు

అగ్నిన్యూస్,కొమరోలు(ఆగస్ట్2): పాఠశాల దశ నుండే విద్యార్థిని విద్యార్థులకు స్వచ్ఛమైన ఆక్సిజన్ ఇవ్వడానికి ప్రతి పాఠశాలలోనూ విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫారెస్ట్ ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్ ఆనందరావు తెలిపారు. కొమరోలు మండల పరిధిలోని కసినపల్లె మండల ప్రాథమిక పాఠశాలలో కొమరోలు మండల అటవీశాఖ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరిపెద్ది శ్రీధర్ శర్మ,ఉపాధ్యాయురాలు గూడూరు గిరిజ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా ఫారెస్ట్ ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్ కే. ఆనందరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయురాలు గిరిజ మొక్క నాటగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు మొక్కకు నీరు పోశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ శర్మ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, వి.వి రమణ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... నేడు పర్యావరణం కలుషితం అవుతుందని,సంపూర్ణమైన ఆక్సిజన్ భావితరాలకు అందించలేక పోతున్నామని అందుకోసం ప్రతి పాఠశాలలో కూడా చిన్న వయసులోనే పాఠశాలల విద్యార్థులకు పాఠశాల ఆవరణంలో మంచి ఆక్సిజన్ అందిస్తే వారు పెద్ద చదువులు చదివే నాటికి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా పాఠశాలలో 15 మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. కొమరోలు మండలంలో పాఠశాలలో కళాశాలల వారికి మొక్కలు పెంచాలని ఆసక్తి ఉంటే కొమరోలు అటవీ శాఖ వారిని సంప్రదించాలని వారు కోరారు. భావితరాల వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే లక్ష్యంతో కొమరోలు అటవీశాఖ అధికారులు నేడు మొక్కలను అందించడం ఒక శుభ పరిణామమని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ శర్మ, ఉపాధ్యాయురాలు గిరిజ తెలిపారు ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వి.వి. రమణ, బేస్తవారిపేట అటవీ శాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు,ఉద్యోగులు





### - యంఈఓ ఆంజనేయులు

అగ్నిన్యూస్,యర్రగొండపాలెం(ఆగస్ట్2): మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు,ఇతర శాఖలైన పోలీస్,వైద్య,ఫారెస్ట్, బ్యాంక్ మొదలైన శాఖలలోని ఉద్యోగులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చదివిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు యం సతీష్ కుమార్, బోయలపల్లి ఎస్సీ సుబ్రహ్మణ్యం, గొల్లవిడిపి ఎస్సీ నాగలక్ష్మీ, జి .మహేశ్వరీ వై పాలెం బిసి సోమా నాయక్ వై పాలెం ఎస్పై నాగేశ్వర రావు,అల్లి పాలెం మొదలైన వారు వారి పిల్లలను వారి పాఠశాలలోనే చదివిస్తూ ఆదర్శంగా వున్నారన్నారు.మన పిల్లలను మనమే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి సమాజంలో ఆదర్శంగా వుండాలనీ ,మనము తప్పకుండా పాఠశాల వయసు పిల్లలందర్నీ కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఒక ఉద్యమంగా చేర్చాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలపై మంచి అభిప్రాయం వుందనీ , దానిని నిలబెట్టుకోవాలంటే అందరూ ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత తెలుపటమే కాకుండా అన్నీ శాఖలలలోని ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే విధంగా చేయాలని పిలుపునిచ్చారు. జి హెచ్ ఎస్ వై పాలెం ప్రధానోపాధ్యాయులు, పుల్లలచెరువు ఎంఇఓ అయిన ఖాసీం, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను ప్రోత్సహించి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో వై పాలెంలో చేర్చడం అభినందనీయం అని ఎంఇఓ ఆయనను కొనియాడారు.పైన తెలుపబడిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ,ఇతర శాఖల ఉద్యోగులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసి వారిని అభినందించారు.విద్యావ్యవస్థ కు ప్రాథమిక పాఠశాలలు పట్టకొమ్మలనీ , వాటిని వాటితో పాటు ఉన్నత పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత , ఆవశ్యకత నేటి ఉపాధ్యాయులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యంఇఓ ఆంజనేయుల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న ఉన్నంతవరకు రైతులకు భరోసా కల్పిస్తాం

అగ్నిన్యూస్,దర్శి (ఆగస్ట్2): చంద్రన్న ఉన్నంతవరకు రైతులకు భరోసా కల్పిస్తామని ఇది మంచి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద రైతులకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకాశం జిల్లాలో ప్రారంభించారు. దర్శి మండలం వీరాయపాలెం గ్రామంలోని పొలాలలోనే రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. 46.85 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.3,174 కోట్లు నగదును జమా చేశారు. జిల్లాలో 2,68,165 రైతులకు రూ.122.74 కోట్లు, దర్శి నియోజకవర్గంలోని 42,871 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.29.06 కోట్ల నగదును పంపిణీ చేశామంటూ రైతులైన సుబ్బరత్తమ్మ, పేరయ్యలకు చెక్కు రూపంలో నగదును రాష్ట్ర ముఖ్యమంత్రి అందజేశారు. దర్శి మండలంలో 10,987 మంది రైతులకు రూ.7.69 కోట్లు, తూర్పు వీరాయపాలెంలో 476 మంది రైతులకు రూ.7.20 కోట్లు నగదు ఇచ్చామన్నారు. ఉదయం 11:30 గంటలకు రైతుల వద్దకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి దాదాపు రెండు గంటలపాటు రైతులతో మండుటెండలోనే గడిపారు. వారణాసిలో పి ఎం కిసాన్ నగదు పంపిణీ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ హాజరు కాగా, ఆ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులతో కలిసి నులక మంచాలపైనే కూర్చుని రాష్ట్ర ముఖ్యమంత్రి తిలకించారు.వ్యవసాయ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో ఏ పంటకు డిమాండ్ ఉంది, ఏ పంట ఎక్కడ వేస్తే మంచి దిగుబడులు వస్తాయి,అనుకూలమైన ప్రాంతం, ఏ పంట వెయ్యాలి అనే అంశాలన్నీ సాంకేతికత ద్వారా మీతో వ్యవసాయం చేయిస్తానన్నారు. ప్రకృతి సేద్యంతో వచ్చే ఆహార ఉత్పత్తులన్ని వందేళ్ళ ఆయుష్ నిస్తుంది, దానికి నేను గ్యారెంటీ అంటూ రైతులకు భరోసా కల్పించారు. రైతులు క్షేమంగా ఉండాలి, వారు పండించిన పంటలకు మంచి గిట్టుబాటు ధరలు రావాలని ఆకాంక్షించారు. అన్నదాత సుఖీభవ నాకెంత మేలు చేసింది.

### అనూష, మహిళా రైతు,

శంకరాపురం ముండ్లమూరు మండలం

నాకు మూడు ఎకరాల భూమి ఉంటే అందులో బొప్పాయి తోట వేశాను. ఎలాంటి పురుగు మందులు వాడకుండానే సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నాను... సార్, దర్శిలో స్టాల్ కూడా ఏర్పాటు చేశాను. చాలామంది రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాను. ఇప్పుడు అన్నదాత సుఖీభవ నగదు వచ్చింది. పంటల పెట్టుబడికి నాకెంతో ప్రయోజనం కలుగుతుంది.సీఎం. మీలాంటి రైతుల కొరకే అన్నదాత సుఖీభవ నగదు పంపిణీ చేస్తున్నాం. ప్రస్తుతం ఏ పథకాలు మీ ఇంట్లో వారికి వస్తున్నాయి, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఎన్టీఆర్ పెన్షన్ వస్తుందా అని ప్రశ్నించారు. అవన్నీ వచ్చాయని చెప్పడంతో సూపర్ సిక్స్ పథకాలన్నీ పేదల సంక్షేమం కొరకేనని, సమర్ధంగా అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు.



నిరుద్యోగులకు స్థిరమైన ఉపాధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

### అనిల్ కుమార్ రైతు, తాళ్లూరు.

నేను డిగ్రీ చదువుకున్నాను. ఉద్యోగం దొరకకపోవడంతో మూడు ఎకరాలలో కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నాను. నాలాగే ఎంతోమంది చదువుకున్న నిరుద్యోగులు ఉన్నారు. అలాంటి వారికి ఉపాధి అవకాశాలు ఏమైనా కల్పిస్తారా. మా గ్రామంలో చెరువు ఉంది, రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాము.

సీఎం. మీలాంటి యువతకు ఇంటి వద్దనే ఉండి ఉద్యోగం చేసుకునే అవకాశాలు కల్పిస్తున్నాం.ఇంటి వద్దనే వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం వచ్చేసింది. పౌల్ట్రీలు, మేకలు, గొర్రెలు, గేదెలు వంటి యూనిట్ల స్థాపనతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఇంటికి ఒకరిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను చేయడం, ఒక కుటుంబానికి ఒక ఎం ఎస్ ఎం ఈ పెట్టాలనే యాచనలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రోడక్ట్ ఏపీలో ప్రవేశపెడుతున్నామన్నారు. తద్వారా యువతకు అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. ఆ గ్రామాలను అనుసంధానిస్తూ రహదారులు నిర్మించాలని కలెక్టర్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు.వ్యవసాయం సులువుగా ఉండేలా యంత్రాలు ఇప్పించండి

### – అచ్చిరెడ్డి, రైతు, గట్టపాలెం.

సీఎం. జవాబుదారీ తనంతో పాలన సాగిస్తున్నాం. వాట్సాప్ గవర్నమెంట్ ఏర్పాటు చేసాం, ఆగస్టు 15 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. మీరు ఇంట్లోనే ఉండి ఏ పని కావాలో ఫోన్ లో క్లిక్ చేస్తే, తద్వారా ప్రభుత్వ సేవలు అన్ని పొందవచ్చు. మీ పొలాలలో పంటకు తెగులు వస్తే ఒక్క కాల్ చేయండి,... డ్రోన్ ద్వారా మీకు పురుగుమందులు పిచికారి చేయిస్తాం. అన్ని సేవలు వాట్సాప్ ద్వారానే మీరు పొందొచ్చు. ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్, మోటార్లు, తదితర యంత్రాలు, డ్రోన్లు తెప్పిస్తున్నాము. బిందు సేద్యం తొలిసారిగా ఏపీలో నేనే ప్రవేశపెట్టాను. రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. రైతుల ప్రయోజనం కొరకు మరింతగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యంత్రాలను అందుబాటులోకి తెస్తామనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చం నాయుడు, 20 సూత్రాల ఏపీ చైర్మన్ లంకా దినకర్ బాబు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# లైంగిక దాడి కేసు.. మాజీ ఎంపీకి జీవిత ఖైదు

(అగ్ని ప్రతినిధి, బెంగళూరు)అత్యాచార కేసులో మాజీ పిఎం దేవెగౌడ మనమడు, జెడిఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు బెంగళూరు స్పెషల్ కోర్టు జీవితఖైదు విధించింది. రూ. 10 లక్షల జరిమానా విధించడమే కాకుండా బాధితురాలికి రూ.7 లక్షలు ఇవ్వాలని ఆదేశించింది.ప్రజ్వల్ అఘాయిత్యానికి పాల్పడినట్లు పని మనిషి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు గత ఏడాది మే 31 న అతడిని అరెస్ట్ చేశారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక



అగ్నిన్యూస్,మార్కాపురం(ఆగస్ట్2): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలు మార్కాపురంలో ఎన్జీవో హెూం లో జరిగాయి. మండలంలో ఉపాధి హామీ కార్మికులకు 2 వందల రోజుల పని దినాలు కల్పించాలని, భూమి లేని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వ భూమిని పంచాలని, ఇంటి స్థలం లేని పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలని, వలస వెళ్లిన సమయంలో రక్షణ కల్పించాలని, ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రమాద బీమా ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని, వలసలు నివారించాలంటే వెలుగొండ ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని సమావేశంలో తీర్మానాలు చేయడం జరిగింది. అనంతరము నూతన కమిటీ ఎన్నిక చేయడం జరిగింది. అధ్యక్షులుగా చిలక కోటమ్మ, ప్రధాన కార్యదర్శిగా తురక ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా గుమ్మా బాల నాగయ్య, సహాయ కార్యదర్శిగా రమేష్, కమిటీ సభ్యులుగా పి చిన్నక్క, చిన్న వీరస్వామి,ఎం సరళ, ఎస్ బాల చెన్నయ్య, జి. సరోజమ్మ, లక్ష్మమ్మ జి విజయ కుమారి,టీ అల్లూరమ్మ, మందా గాలయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.

## ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పొలాల్లోకి వెళ్లిన బస్




అగ్నిన్యూస్,మార్కాపురం(ఆగస్టు2):ద్విచక్ర వాహనాలను తప్పించబోయిన బస్ పొలాల్లోకి వెళ్ళిన ఘటన మార్కాపురం నుండి ఒంగోలు వెళ్తున్న చెరువుకట్టపై గల రోడ్డులో శనివారం జరిగింది.వివరాలప్రకారం రెండుబైకులను తప్పించబోయే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు, డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సు ఆపి బస్సులో 50 మంది వరకు ప్రయాణికులు డ్రైవర్ సీట్ నుంచి క్రిందికి దించారు.ప్రయాణికులకు ఎలాంటి అపాయం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



## పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించాలి



అగ్నిన్యూస్,యర్రగొండపాలెం(ఆగస్టు2):మండలంలోని కొత్త గోళ్ళవిడిపి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఆగష్టు 1వ తేది నుంచి 8 వ తేది వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సూపర్ వైజర్ తెలిపారు ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త పూజల. మూర్తెమ్మ మాట్లాడుతూ  పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించాలని, అలా చేయడం వల్ల పుట్టిన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, తల్లికి బిడ్డకు దగ్గర సంబంధం ఉంటుందన్నారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో  ఏ యన్ యం  పి. సి. హెచ్. పుల్లమ్మ, ఆశా వర్కర్ ఔకు.సారమ్మ, అంగన్వాడీ హెల్పర్  యస్.నాగేశ్వరి  గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రివర్గంలో మార్పుచేర్పులు ?



(అగ్ని ప్రతినిధి, న్యూఢిల్లీ) కేంద్ర మంత్రి వర్గాన్ని మార్చాలని ప్రధాని మోదీ భావిస్తున్నారు. పని చేయని మంత్రుల్ని తొలగించి.. పని చేసేవారిని అలాగే.. రాబోతున్న బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మార్పు చేర్పులు చేయాలనుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉపరాష్ట్రపతికి అభ్యర్థిని కూడా ఎంపిక చేయాల్సి ఉంది.ఉపరాష్ట్రపతిగా బీజేపీ సీనియర్ నేతను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఆయన రాజ్ నాథ్ సింగ్ లేదా గడ్కరీ కావొచ్చన్న అభిప్రాయాలు ఉన్నాయి. అలాగే శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు కూడా వినిపిస్తోంది. బీజేపీ అధ్యక్ష పదవికి కూడా ఆయన పేరు వినిపిస్తోంది.ఇలా కీలకమైన పదవులకు ఈ కేంద్ర మంత్రుల్ని సర్దుబాటు చేస్తే..కీలక పదవులు ఖాళీ అవుతాయి. ఈ సారి ప్రధాని మోదీ ఆరెస్సెస్ సూచనలకు ప్రాధాన్యమిస్తారని చెబుతున్నారు. అందుకే మార్పు చేర్పులు భారీగానే ఉంటాయని అంచనాకు వస్తున్నారు. టీడీపీకి మరో సహాయ మంత్రి పదవిని ఆఫర్ చేసే అవకాశాలున్నట్లుగా తెలుస్తోంది. బండి సంజయ్ తాను తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు పని చేస్తానని కేంద్ర మంత్రి పదవి వద్దని అంటున్నారు. ఆయన స్థానంలో లక్ష్మణ్‌కు అవకాశం ఇస్తారని చెబుతున్నారు.ఇరవై ఒకటో తేదీ లోపు ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. కేబినెట్ సమీకరణాలు కూడా ఇందులో ముడిపడి ఉంటాయి. అందుకే ఆ లోపే.. మంత్రివర్గంలో మార్పు చేర్పులు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.









Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)